నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజమాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. బర్కత్‌పుర ఫీడర్ పరిధిలోని బర్కత్‌పుర పద్మకాలనీ, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు... శంకర్‌మఠ్, బౌద్ధనగర్ ఫీడర్ల పరిధిలోని నల్లకుంట, మాతృశ్రీ స్కూల్, కౌసర్ మజిద్, బీజేపీ ఆఫీస్ వారసీగూడ తదితర ప్రాంతాలలో 10.30 నుంచి 11గంటల వరకు... జిందా తిలిస్మత్ ఫీడర్ పరిధిలోని శంకర్‌నగర్, అన్నపూర్ణనగర్, దుర్గనగర్ తదితర ప్రాంతాలలో 4 నుంచి 4.30గంటల వరకు... సీఈకాలనీ ఫీడర్ పరిధిలోని బతుకమ్మ కుంట, శివం, శారద నగర్, బాగ్ అంబర్‌పేట్ తదితర ప్రాంతాలలో 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

సరస్వతీ సంగీత విద్యాలయంలో అన్నమయ్య జయంతి 12న

నల్లకుంట: శ్రీసరస్వతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 12న పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అధ్యాపకురాలు మల్లాది యశస్విని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సంగీత విద్యాలయంలో ఆ రోజు సాయంత్రం సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో అన్నమయ్యకు సంకీర్తనార్చన ఉంటుందన్నారు.

జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో...

శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ టీటీడీ ప్రాంగణంలో 12న అన్నమయ్య జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు.ఆరోజు సాయంత్రం 5.30గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కులగణన నిర్ణయం అభినందనీయం



బర్కత్‌పుర చమన్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రజకులు

కాచిగూడ: దేశ జనగణనతో పాటు కులగణన చేస్తామని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలంగాణ రజక రిజర్వేషన్ పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం బర్కత్‌పుర చమన్ వద్ద సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి రజకులు పాలాభిషేకం చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని పరిశీలించి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ జైహింద్, నరేష్, పాలాస శ్రీనివాస్, కొత్ర సంపత్, తిప్పరాజు కృష్ణ, గుడ్లసర్వ శ్రీశైలం, చాకలి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య 'బంగారం'

సౌత్ ఏషియన్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలు



త్రివర్ణ పతకంతో రమణయ్య

కాచిగూడ: ఇంటర్ నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్ ఇండో – నేపాల్‌లోని రంగశాల స్టేడియంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో నగరానికి చెందిన ఆర్.రమణయ్య ఇండియా నుంచి 45 సంవత్సరాల విభాగంలో లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పాల్గొని 3 బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. గతంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు. ఇంటర్నేషనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలనే పట్టుదలతో సాధన చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ప్రోత్సహించాలని కోరారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో సమితి ప్రధాన కార్యదర్శి వెంకన్నతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉచిత బస్సు ప్రయాణం, గుర్తింపు కార్డులు జారీ చేసి నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని కోరారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు!

ప్రజలకు తప్పని తిప్పలు



బాగ్‌లింగంపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసలే ఎండకాలం. భరించలేని ఉక్కపోత. ఇలాంటి సమయంలో ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నేడు విద్యుత్ అనేది కనీస అవసరమైంది. ఆ విద్యుత్ లేకుంటే ఏమి తోచని పరిస్థితి. టీవీ చూడాలన్నా.. చార్జింగ్ పెట్టలన్నా.. వంటలకు మిక్సీ ఉపయోగించాలన్న ఇలా ప్రతి పనికి విద్యుత్‌పై ఆధారపడాల్సింది. అలాంటి విద్యుత్‌ను అస్తమానం తీసేస్తుంటే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ విద్యుత్‌పోలేదని ఇప్పుడు విద్యుత్‌ను ఉచితం చేశాక ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్‌ను తీసేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తూ.. వినియోగాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక రాత్రిపూట అయితే భరించలేనిది...

ఇక రాత్రిపూట కూడా ఎప్పుడు పడితే అప్పుడు సుమారు 4, 5 సార్లు విద్యుత్ తీస్తుండటంతో ప్రజలు భరించలేకపోతున్నారు. అర్ధరాత్రి గాఢనిద్రలో ఉన్నాక విద్యుత్‌పోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం 3 నుంచి 5గంటల ప్రాంతంలో 2, 3 సార్లు విద్యుత్ తీస్తున్నారని చిన్న పిల్లలు ఉక్కపోత భరించలేక ఏడుస్తుండటంతో అటూ తల్లులు, పిల్లలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతలు తీవ్రమయ్యాయి...



ఎప్పుడు పడితే అప్పుడు సమయపాలన లేకుండా కరెంట్ తీసేస్తున్నారు. విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయి. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఫలానా టైమ్‌కు విద్యుత్ పోతుందని తెలిసి దాని కంటే ముందే అన్ని పనులు చక్కదిద్దుకుంటాం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– మన్నె దామోదర్‌రెడ్డి

కోతలు లేకుండా చూడాలి



విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి. ఉచిత విద్యుత్ వల్లే ఈ పరిస్థితి దాపురించిందా అనే సందేహం కలుగుతుంది. ఉచితం అంటూ విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలి.

– బి.వెంకటస్వామిగౌడ్

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేట్రేగిపోతున్న మతోన్మాదుల ఆగడాలను ఆరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు అన్ని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. మహా పురుషులు పూలే, అంబేడ్కర్ చూపిన మార్గంలో యువత మతోన్మాదంపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రజాస్వామ్య దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుమయ్య, మనోహర్, లలిత, ప్రకాష్, రాధాకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు కేటాయించండి



బస్తీవాసులతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేత వినయ్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బస్తీవాసులతో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలసి వినతిపత్రం అందజేశారు. బస్తీవాసుల ఇళ్లు కూల్చివేసి ఏడాదిన్నర గడుస్తున్నా అధికారులు ఇంత వరకు బాధితులకు ఇళ్లు కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, మంత్రి ప్రొన్నం ప్రభాకర్‌లను కలసి విన్నవించామని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తర్వలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను బహిష్కరిస్తుంటే ప్రభుత్వానికి పట్టదా.?

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు వార్షిక పరీక్షలు బహిష్కరిస్తున్నా... విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నా ప్రభుత్వానికి పట్టదా.? అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఏప్రిల్‌లో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 11 సార్లు కలెక్టరేట్లు ముట్టడి, తరగతుల బహిష్కరణ ఉద్యమాలు జరిగాయని అయినా ప్రభుత్వం మొద్దు నిద్రను వీడటం లేదన్నారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాకిస్తానీయులను పంపించే ప్రక్రియ వేగవంతం చేయండి



నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కవాడిగూడ: హైదరాబాదులో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ పౌరులను వారి దేశానికి పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని మహంకాళి జిల్లా కమిటీ బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ దేశం నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి వీసా గడువు ముగిసినా వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని అన్నారు. వారిని గుర్తించి వెంటనే వారి దేశానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, మల్లంపేట రమేష్‌రామ్, కేసర్ల దీపిక, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రామిరెడ్డి, పూసరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



బీసీ చైతన్య సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి.హనుమంతరావు, కోల జనార్దన్ తదితరులు

కాచిగూడ: వెనుకబడిన కులాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో 'బీసీ చైతన్య సదస్సు'నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చెన్న రాములు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని సోషల్ డెమొక్రటిక్ జేఏసీ కార్యాలయంలో 'బీసీ చైతన్య సదస్సు'పోస్టర్‌ను కాంగ్రెస్ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జేఏసీ జాతీయ చైర్మన్ కోలా జనార్దన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి ఆర్డినెన్స్ ద్వారా చట్టబద్ధత కల్పించాలన్నారు. జనాభా ప్రాతిపదిక బడ్జెట్‌లో బీసీలకు వాటా కల్పించాలని కోరారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు న్యాయం చేస్తే 'సామాజిక న్యాయం'అవుతుందన్నారు. మహిళా బిల్లును సవరించి 33 శాతం నుంచి 50శాతం వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జేఏసీ జాతీయ చైర్‌పర్సన్ స్వరూప, బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు సూర్య నారాయణ, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



గోల్నాక మారుతీనగర్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధికి చొరవ తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ మారుతినగర్‌లోని రూ.38 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డును నిర్మించనున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రహదారుల నిర్మాణంతో పాటు పైపులైన వ్యవస్థ ఆధునీకరణ, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెస్ టోర్నమెంట్-2025

చార్మినార్: ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో చార్మినార్ ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్-2025 నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. పాతబస్తీ ఉర్దూఘర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ఈ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలిచే విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందజేయనున్నామన్నారు. ముందుగా వచ్చిన వారికి ముందుగా అవకాశం కల్పించనున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పోటీదారుల సౌకర్యార్థం భోజన వసతి కల్పించడం జరిగిందన్నారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: చిన్నారులను శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో నిహారిక కళాక్షేత్రం, భవయామి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్‌ల ఆధ్వర్యంలో భారత కళోత్సవం 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు.

పేదల పక్షపాతి బీఎన్ రెడ్డి



బీఎన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వనం సుధాకర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల పక్షపాతి భీంరెడ్డి నరిసింహ రెడ్డి(బీఎన్ రెడ్డి) అని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ ఎంపీ బీఎన్‌రెడ్డి 17వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనం సుధాకర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం పాలనను ఎదిరించి తుపాకీ చేతబట్టి పోరాడని గొప్ప యోధుడని కొనియాడారు. దున్నే వాడికే భూమి దక్కాలని భూస్వాముల చెంతన ఉన్న భూములను పేదలకు పంచిన గొప్ప నాయకుడని అన్నారు. భూస్వాముల దొరల ఆగడాలకు అడ్డుకట్టవేసి వెట్టిచాకిరిని నిర్మూలించాలనే లక్ష్యంతో పది లక్షల ఎకరాల సాగుభూమిని ప్రజలకు పంచి 4వేల గ్రామాలలో ప్రజాపాలన కొనసాగించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, తుడం అనిల్, పుష్ప, మురళి, కుంభం సుకన్య, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి



వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడివయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని.. ప్రతి వికలాంగునికి ఇన్సురెన్స్ సదుపాయం కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయ ముట్టడించాలని ఎంపీఆర్‌డీ పిలుపునిచ్చింది. చిక్కడపల్లిలోని ఆ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ముట్టడి పోస్టర్‌ను ఎంపీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగాలని గత ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కానీ అది అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. వెంకటేష్, పి. శశికళ తదితరులు పాల్గొన్నారు.

13న తాళ్లపాక అన్నమాచార్య జయంతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర

చిక్కడపల్లి: నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతిని 13న నిర్వహిస్తున్నట్లు సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయకుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి, నిష్టల సుధామాల తెలియజేశారు. చిక్కడపల్లి సమితి కార్యాలయంలో శుక్రవారం అన్నమాచార్య జయంతి పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర, నిర్వాహక సంస్థల సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... త్యాగరాయ గాన సభలో జరిగే ఈ కార్యక్రమంలో నృత్యగురువు సీతాప్రసాద్ లక్ష్మి, బృందం అన్నమయ్య కథ సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. సంగీత కళాకారులు డాక్టర్ వై.రమాప్రభ, డాక్టర్ ద్విభాష్యం వీఎస్ఎస్ మూర్తిల శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనా గానం చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.చంద్రశేఖర్, రజిత్ ఆకుల, కామిశెట్టి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డుతో అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక భద్రత



సంజయ్‌గాంధీనగర్ బస్తీ కార్మికులకు కార్డులు అందజేస్తున్న నవనీత

నల్లకుంట: అసంఘటిత రంగంలోని కార్మికులకు సంఘటిత రంగ కార్మికులతో సమానంగా పలు సామాజిక పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కార్డులు (ఈశ్రమ్ కార్డులు) అందజేస్తోందని ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటీ కో-ఆర్డినేటర్ మల్లారపు నవనీత చెప్పారు. ఇటీవల ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికులకు శుక్రవారం విద్యానగర్ సంజయ్య గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో లేబర్ గుర్తుంపు కార్డులు పంపిణీ చేపట్టారు. ఈ లేబర్ కార్డు ద్వారా ఆరోగ్య సంరక్షణ, ప్రమాద బీమా, పెన్షన్లు, పిల్లల విద్యా ఉపకార వేతనాలు, ప్రసూతి ప్రయాజనాలు, గృహ నిర్మాణ సహాయం వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. ఈ కార్డు ఉన్న కార్మికులు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



మా వైష్ణోవ్ గోశాలలో పశువులకు దాణా పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

కాచిగూడ: పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సమర్పణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మా వైష్ణోవ్ గోశాలలో పశువులకు పశుదాణాను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్‌ను గోవధ నిరసన రోజుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న గోసంతతిని చెక్‌పోస్టుల వద్ద నుంచే తిరిగి పంపించేయాలని కోరారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మండలాల్లో స్పెషల్ టాస్క్‌ఫోర్సును మరింత బలోపేతం చేయాలన్నారు. గోవధను అరికట్టేందుకు హైదరాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, మల్కాజిగిరి, రంగారెడ్డి తదితర జిల్లాల్లో గోవధ నిషేధంపై పీస్ కమిటీలతో అధికారులు సమీక్షలు నిర్వహించాలని కోరారు. ఒంటెలు తెలంగాణలోకి తీసుకురావొద్దని హైకోర్టు ఆదేశాలున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. నగరానికి ఒంటెలను తీసుకొచ్చి మాంసం విక్రయిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణా మరింత ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున నిఘా కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గో సేవకులు దీపక్ దయాల్ దాదూను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రతినిధులు ప్రేమ్‌చంద్ మునోద్, మహేందర్ గుప్తా, శివరాజ్ సుంత్‌వాల్ మహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు చేతులు కలపాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



భోలక్‌పూర్‌లో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ప్రజలు

కవాడిగూడ: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేస్తున్న దాడికి ప్రపంచ దేశాలు మద్దతు పలికి శాంతి నిలపడానికి కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ జాతీయ జెండాలు చేతబూని 'ఉగ్రవాదం నశించాలి... పాక్ దుశ్చర్యలను ప్రపంచ దేశాలు ఖండించాలి'అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. భోలక్‌పూర్‌లోని సుప్రీంహోటల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ అంజుమన్‌తో పాటు పలు బస్తీలలో కొనసాగింది.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న భారత ఆర్మీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. భారత్, పాకిస్తాన్ యుద్ధం సందర్భంగా భారత ప్రజలు ఏకతాటి పైకి వచ్చి కులమతాలు, పార్టీలకు అతీతంగా భారత ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించడం వల్ల పహల్గామ్ దాడి బాధితులకు కొంతవరకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, మహమ్మద్ అలీ, చిట్టి శ్యాంసుందర్, కొండపల్లి మాధవ్, శంకర్‌గౌడ్, షరీఫుద్దీన్, గుల్షాన్, చాంద్‌బాషా, జబ్బార్, రహీం, ఆరీఫ్, మహేష్, మాధవ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.